క్లుప్తంగా

అన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి యున్న శ్రీతిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గురువారం గుంటూరు జిల్లా మండడం మండలం, మల్కాపురం గ్రామానికి చెందిన గద్దె వెంకటసుబ్బారావు, ఉషారాణి దంపతులు రూ.10,116వేలు విరాళంగా ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. గంపలగూడెం మండలం నెమలి గ్రామానికి చెందిన దుబ్బాకుల రామకృష్ణ, పుష్పలత దంపతులు రూ.5 వేలు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నందిగామ: సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం నందిగామ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉన్న ఆటో స్టాండ్ ల వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ నాయకులు మాట్లాడుతూ సీఐటీయూ తరపున చేపట్టిన కార్యక్రమాలను గుర్తుచేశారు. కార్మికుల అభ్యున్నతికి పోరాడుతున్నట్లు వివరించారు. సీఐటీయూ నాయకులు కటారపు గోపాల్, సయ్యద్ ఖాసిం, హుస్సేన్, ఏసోబు, పుల్లయ్య, అనిల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 123 మంది హాజరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పాలిటెక్నిక్ పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 123 మంది హాజరయ్యారు. 49,001 నుంచి 54,000 ర్యాంకు అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో వారి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. కౌన్సెలింగ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. శుక్రవారం 59,001 నుంచి 67,000 వరకు ర్యాంకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు

శ్రీరామనామంతో హనుమంతుడి అనుగ్రహం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో దీక్ష విరమణలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 28వ తేదీ నుంచి పీఠంలో హనుమత్ జయంతి, దీక్ష విరమణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం అభయ వీరాంజనేయ స్వామి వారిని పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ స్వామిజీ పంచామృతాలతో అభిషేకాలు, అర్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమాలు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు భక్తులు దీక్షలను విరమించేందుకు పీఠానికి తరలివచ్చారు. తొలుత దీక్ష పరులను ఉద్దేశించి దుర్గా ప్రసాద్ స్వామిజీ అనుగ్రహ భాషణం చేశారు. అన్ని నామాలలో శ్రీరామ నామం ఎంతో బలమైనదని, శ్రీరామ నామంతో హనుమంతుడి అనుగ్రహాన్ని సైతం పొందవచ్చునని పేర్కొన్నారు. అనంతరం పీఠం ఆవరణలో దుర్గా ప్రసాద్ స్వామిజీ చేతుల మీదగా పలువురు భక్తులు దీక్షలను విరమించారు. భక్తులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను దేవస్థానం కల్పించింది.

తొలి ఫలితం నందిగామదే

- 16 రౌండ్లలో జగ్గయ్యపేట, నందిగామల ఓట్ల లెక్కింపు
- మధ్యాహ్నం మూడు గంటలకల్లా ఫలితాల వెల్లడికి అవకాశం
- ఓట్ల లెక్కింపునకు పటిష్ట బందోబస్తు



పోలింగ్ అనంతరం నోవా ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరుస్తున్న ఎన్నికల సిబ్బంది(ఫైల్)

నందిగామ/ జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మరో నాలుగురోజుల్లో జరుగనున్న నేపథ్యంలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో గెలుపోటములపై రాజకీయవర్గాలతోపాటు ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. జూన్ నాలుగో తేదీన జరుగనున్న ఓట్లలెక్కింపు కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలిఫలితం నందిగామ నియోజకవర్గందే కానుంది.

14 టేబుళ్లు..16 రౌండ్లు..

ఇబ్రహీంపట్నం సమీపంలోని జూపూడి గ్రామ పరిధిలో ఉన్న నోవా ఇంజనీరింగ్ కళాశాలలో నందిగామ ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే ఎన్నికల సిబ్బందిని ర్యాండమైజేషన్ పద్ధతిలో ఇప్పటికే ఎంపిక చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభంకాగానే తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. అనంతరం ఈవీఎంలను పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కిస్తారు. నందిగామ నియోజకవర్గంలో మొత్తం 222 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల బరిలో 9మంది అభ్యర్థులు ఉన్నారు. నందిగామ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం 14టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో రౌండ్‌లో 14 ఈవీఎం కంట్రోల్ యూనిట్ల(సీయూ)ను లెక్కిస్తారు. ఈలెక్కన నందిగామ ఓట్ల లెక్కింపు 16రౌండ్లలో కొనసాగుతుంది. తొలుత చందర్లపాడు మండలంలోని గుడిమెట్ల గ్రామం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. చివరగా కంచికచర్ల మండలంలోని గనిఆత్కూరు గ్రామ ఓట్లను లెక్కిస్తారు. ఓ రౌండ్ ఓట్ల లెక్కింపునకు 20నుంచి 25నిమిషాల సమయం పడుతుంది. మధ్యాహ్నం 3గంటలకల్లా నందిగామ నియోజకవర్గ ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. అనంతరం కొద్దిసేపటికే జగ్గయ్యపేట ఫలితం వెలువడుతుంది.

నందిగామలో 88.58శాతం పోలింగ్..

నందిగామ నియోజకవర్గంలో 88.58శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,05,480 మంది ఓటర్లు ఉండగా 1,79,952మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్నవారిలో పురుషులు 87,769మంది ఉండగా, మహిళలు 92,179మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు.

పేటలో జిల్లాలోనే అత్యధిక పోలింగ్..

జగ్గయ్యపేట ఓట్ల లెక్కింపు ఇబ్రహీంపట్నం సమీపంలోని నిమ్రా కళాశాలలో జరుగనుంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎన్టీఆర్ జిల్లాలోనే అత్యధికంగా 89.88శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,05,364 మంది ఓటర్లకుగాను 1,84,575 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 88,667 మంది ఉండగా, మహిళా ఓటర్లు 95,904 మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు.

2102 పోస్టల్ బ్యాలెట్లు..

నందిగామ నియోజకవర్గానికి సంబంధించి సైనిక దళాల్లో పనిచేస్తున్న సర్వీసు ఓటర్ల సంఖ్య 41 ఉండగా, 15మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2102మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. హోమ్ ఓటింగ్‌కు 109మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 108మంది ఓటేశారు.

తొలిగా తక్కెళ్లపాడు ఈవీఎంల లెక్కింపు..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ కోసం 2359 దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2309మంది ఓటేశారు. నియోజకవర్గంలో సర్వీసు ఓటర్లు 51మంది ఉండగా ఇప్పటి వరకు 24మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. హోమ్ ఓటర్లు 150మందికిగాను 146మంది ఓటేశారు. పోస్టల్‌బ్యాలెట్ల కోసం నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేసి, రెండు రౌండ్లలో లెక్కింపు పూర్తిచేయనున్నారు. జగ్గయ్యపేట ఓట్ల లెక్కింపు కూడా 16రౌండ్లలోనే పూర్తవుతుంది. ఓట్ల లెక్కింపు కోసం 14టేబుళ్లు ఏర్పాటు చేస్తారు. జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామ ఈవీఎంలతో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. చివరిగా నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామమైన రుద్రవరం ఈవీఎంలను లెక్కిస్తారు. నందిగామతో పోల్చితే జగ్గయ్యపేటలో సుమారు 4,623 ఓట్లు అధికంగా పోలయ్యాయి. అదేవిధంగా జగ్గయ్యపేట ఎన్నికల బరిలో 13మంది అభ్యర్థులు ఉండటంతో ఓట్ల లెక్కింపునకు సుమారు ఏడు నుంచి ఏడున్నర గంటల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు అధికారులు కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆర్వో సమీక్ష



జగ్గయ్యపేట: జూన్ నాలుగో తేదీన ఇబ్రహీంపట్నం నిమ్రా కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపు సమయంలో ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌంటింగ్ సిబ్బందితో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ రోజున ఉదయం నాలుగు గంటల కల్లా జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో ఆరు గంటల కల్లా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపునకు 80 మంది సూపర్‌వైజర్‌లు, 50మంది మైక్రో అబ్జర్వర్‌లు విధులలో ఉంటారన్నారు. ఆయా అభ్యర్థుల తరపున 350 మంది ఏజెంట్లు వస్తారని వివరించారు. ఉదయం ఎనిమిది గంటలకల్లా ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, మొత్తం 14 టేబుళ్ల, 16రౌండ్లలో ఓట్ల లెక్కింపు కొనసాగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేసి 500 చొప్పున పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ జూన్ రెండు, మూడు తేదీల్లో ఏజెంట్ల సమక్షంలో కౌంటింట్ కేంద్రాలకు తరలిస్తామని వివరించారు. సమావేశంలో ఏఆర్వో నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల దుకాణంలో తనిఖీలు



విత్తనాల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ సీహెచ్ భవాని

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్డులో ఉన్న సాయి వెంకటరమణ విత్తనాల దుకాణాన్ని ఏడీఏ సీహెచ్.భవానీ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణ లైసెన్స్, స్టాక్ రిజిస్టర్లు, పీసీలు, బిల్ బుక్స్‌ను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా అనుమతులు లేకుండా విత్తనాలు అమ్మడం, నకిలీ విత్తనాలు విక్రయించడం నేరమన్నారు. విత్తనాలు ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా పత్తి విత్తనాలను కొనే ముందు లైసెన్స్ ఉన్న డీలర్ వద్దనే కొనుగోలు చేయాలని, పక్క జిల్లాల నుంచి రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి ఎవరైనా నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు అమ్మితే తమకు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేయాలని రైతులను కోరారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లు తప్పకుండా తీసుకోవాలని, బిల్లుపై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, రేటు తప్పనిసరిగా ఉండాలన్నారు. విత్తన పాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసే తేదీ కూడా సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అధిక ఉష్ణోగ్రత కారణంగా మొలకశాతం దెబ్బతినే పరిస్థితి ఉన్నందున రైతులు తొందరపడి విత్తనాలు విత్తకుండా తగినంత తేమ శాతం ఉన్నపుడు మాత్రమే విత్తుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఏడీఏ వెంట ఏవో వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి విశేష పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తి విగ్రహానికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాస శాస్త్రి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఆలయ ఈవో కె.ఎస్.రామరావుతోపాటు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



మున్నేటి తీరంలో చెత్తాచెదారం తొలగింపు



మున్నేరు వద్ద చెత్తను తొలగిస్తున్న నందిగామ మున్సిపల్ సిబ్బంది



మున్నేటి తీరం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్

నందిగామ: మున్నేటి తీరం చెత్తాచెదారంతో నిండి ఉండటంపై 'కాలుష్య కోరల్లో మున్నేటి తీరం' శీర్షికతో 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్నేటీ తీరంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ సిబ్బందిచే తొలగింపజేశారు. అదేవిధంగా మునేటి తీరంలో చెత్తాచెదారాన్ని వేయకూడదంటూ హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. చెత్తను పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్నేటి తీరం పరిశుభ్రంగా ఉండేలా సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన 'సాక్షి'కి పర్యావరణ ప్రేమికులు అభినందనలు తెలియజేశారు.

పాఠశాలకు రోడ్డు వసతిపై హర్షం



అల్లూరు పాఠశాల ఎదురుగా నిర్మించిన ఆర్చి, ఏర్పాటు చేసిన రహదారి

అల్లూరు(వీరులపాడు): మండలంలోని అల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యుత్ హైటెన్షన్ తీగలను తొలగించడంపై గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ పాఠశాల ఆవరణ మీదుగా విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో భయంభయంగానే సంచరించాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పాఠశాలకు సరైన రోడ్డు వసతి లేకపోవడంతో ప్రైవేట్ భూముల్లోంచి వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు నందిగామ ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే విద్యాశాఖ అధికారులతోపాటు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం రూ.6.50లక్షలు కేటాయించడంతో రూ.5లక్షలతో విద్యుత్ హైటెన్షన్ తీగలను పాఠశాల ఆవరణ నుంచి మార్చి, మరో ప్రాంతం మీదుగా లైన్ ఏర్పాటు చేశారు. రూ.1.50లక్షలతో పాఠశాలకు రోడ్డువసతి కల్పించడంతోపాటు ఆర్చి నిర్మాణం చేపట్టారు. ఈ పనులన్నీ ఎన్నికల కోడ్‌కు ముందుగానే పూర్తికావడంతో ఈ విద్యాసంవత్సరం నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

చదువుతోపాటు ఆటా..పాట



హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణ ఇస్తున్న టీచర్ వినోద్‌కుమార్



పేటలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



కంచికచర్లలో డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు



కంచికచర్లలో చెస్ నేర్చుకుంటున్న చిన్నారులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శిక్షణలో భాగంగా గురువారం విద్యార్థులచే పుస్తకపఠనం చేయించారు. ఇంగ్లిష్ హ్యాండ్ రైటింగ్‌పై ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్, విద్యార్థులకు శిక్షణనిచ్చారు. విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని కంచికచర్ల గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం చిన్నారులకు యోగా, డ్యాన్స్, డ్రాయింగ్‌పై శిక్షణనిచ్చారు. విద్యార్థులచే పుస్తకపఠనం చేయించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, కవి నీలం సర్వేశ్వరరావు, యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, డాన్స్ మాస్టర్ వేల్పుల ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి వేడుకలకు ఆలయాల ముస్తాబు



మధురానగర్ శ్రీకల్యాణ రామాలయం



ముత్యాలంపాడులోని ఆంజనేయస్వామి విగ్రహం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వచ్చే నెల ఒకటో తేదీ శనివారం హనుమజ్జయంతి వేడుకలకు నగరంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. స్వయం భూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం, ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయం, మధురానగర్ శ్రీ కల్యాణ రామాలయం, పప్పులమిల్లు సెంటర్‌లోని శ్రీ బాల ఆంజనేయస్వామివారి దేవాలయం, అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠం, రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే మందిరాలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. అలాగే ఒకటో తేదీన హనుమజ్జయంతి పురస్కరించుకుని స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో గురువారం నుంచి ఐదు రోజుల పాటు హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామని ఆమె పేర్కొన్నారు.

మిసెస్ టైటిల్ సాధించిన శైలజ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని జైపూర్ పింక్ ప్యాలెస్ ఎగ్జిబిషన్‌లోగల గరిమెళ్ల సుబ్బారావు స్మారక కళావేదికపై గురువారం సాయంత్రం ఫాల్ ఇన్ ఫ్యాషన్ పేరుతో సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో పురుషులు, మహిళలకు జరిగిన ఈ పోటీలో సీనియర్ విభాగంలో ప్రిన్స్ టైటిల్‌ను ఎస్.బాబు గెలుచుకున్నారు. అలాగే ప్రిన్సెస్ టైటిల్‌ను ఇందు కైవసం చేసుకున్నారు. జూనియర్స్ విభాగంలో ప్రిన్సెస్ టైటిల్‌ను అమృత, ప్రిన్స్ టైటిల్‌ను సంకల్పా రెడ్డి అందుకున్నారు. మిసెస్ టైటిల్‌ను శైలజ, సీనియర్ కేటగిరిలో విన్నర్లుగా మణి ప్రియ, సుధారాణి, రత్నకుమారి, గాయత్రి, పద్మలత నిలిచారు. జూనియర్ విభాగంలో స్వగ్గర్, ఖుషి, మహాలక్ష్మి, జ్యోతిక, హిత ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ఎగ్జిబిషన్ నిర్వాహకులు గరిమెళ్ల నానయ్య చౌదరి బహుమతులను ప్రదానం చేయగా వ్యాఖ్యాతగా చంద్రిక వ్యవహరించారు.

ముగ్గురు యువకులు అరెస్టు

పెనమలూరు: బైక్‌పై వెళుతున్న వ్యక్తిని అటకాయించి ముగ్గురు యువకులు బెదిరించి సెల్ ఫోన్ చోరీ చేసిన నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం ఈడుపుగల్లుకు చెందిన చింతా నారాయణరావు బుధవారం వేకువజామున తన బైక్‌పై విజయవాడ నుంచి ఈడుపుగల్లుకు బయలుదేరాడు. గంగూరు సెంటర్ వద్దకు రాగా విజయవాడ చిట్టినగర్‌కు చెందిన కె.అశోక్, కుంచం అరుణ్‌కుమార్, మరో మైనర్ వేరే బైక్‌పై వచ్చి అటకాయించారు. నారాయణరావును బెదిరించి ఆయన వద్ద ఉన్న సెల్ ఫోన్ చోరీ చేసి పరారయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.